స్వచ్ఛతపై అవగాహన



దమ్మాయిగూడలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కీసర: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ 10వ వార్డు దమ్మాయిగూడలో శనివారం ఇంటింటికి వెళ్లి తడి, పొడి వ్యర్థాలపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ మహాసభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తోటపల్లి శంకర్

జవహర్‌నగర్: సీపీఐ మహాసభను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ దళితభవన్‌లో పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సీపీఐ పార్టీ ముందుంటుందన్నారు. ఈనెల 19 నుంచి 22 వరకు మేడ్చల్‌లో జరిగే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాదగిరి, ఎల్లయ్య, నర్సింహ, శాంసన్, దానియెల్ తదితరులు పాల్గొన్నారు.

5న రేషన్‌కార్డుల పంపిణీ

మేడ్చల్: నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఈనెల 5న పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భూపాల్ తెలిపారు. ప్రభుత్వం నూతన లబ్ధిదారులకు రేషన్‌కార్డులను మంజూరు చేసిందని, మంజూరీ పత్రాలను అత్వెల్లిలోని జీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కీసర: లారీ, ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసరలో నివసించే నవీన్ (22) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. యాద్గార్‌పల్లి గోశాల వద్ద లారీ ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై నుంచి రోడ్డుపై పడిన నవీన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ లారీని వదిలేసి పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎన్‌ఎఫ్‌బీఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. శనివారం బోడుప్పల్‌లో ఆమె మాట్లాడుతూ.. ఎన్‌ఎఫ్‌బీఎస్ కింద ప్రాథమిక కుటుంబయజమాని (18 నుంచి 60) మరణిస్తే ఆ కుటుంబ పెద్దకు రూ.20 వేల ఎక్స్‌గ్రేషియా అందుతుందన్నారు. అర్హులు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మృతి చెందిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం, దరఖాస్తుదారుడి ఆధార్‌కార్డు (కుటుంబ పెద్ద), కుటుంబ రేషన్ కార్డులను ఈనెల 6 లోగా అందజేయాలన్నారు. మరింత సమాచారానికి మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మేడిపల్లి: భర్తతో గొడవపడి తన ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న మేకల రాశి(26) కుమార్తెలు భవ్య(8)దివ్య(5)లను తీసుకుని గతనెల 27న ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం ఆమె సోదరుడు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భార్యభర్తల మధ్య గొడవల కారణంగానే ఆమె కనిపించకుండా పోయిందని సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

రామంతాపూర్ : జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణితం, ఇంగ్లిష్, ఫిజిక్స్ బోధించే గెస్ట్ లెక్చరర్స్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 5 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9912342062.

మహిళా సాధికారతకు కృషి

మహిళా సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు

- బ్యాంకు లింకేజీ ద్వారా రుణ లక్ష్యం రూ.197.85 కోట్లు
- పంపిణీ చేసిన రుణాలు రూ.38.85 కోట్లు
- 2,612 సంఘాలకు రుణంపై డీఆర్‌డీఏ ప్రణాళిక



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా సంఘాలకు ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని నిర్దేశించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల్లో 2,612 సంఘాలకు రూ.197.74 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరు చేసేలా ప్రణాళికను రూపొందించారు. గతేడాది జిల్లాలో 2,794 మహిళా సంఘాలకు రూ.197.85 కోట్ల బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం కాగా.. రూ.211.95 కోట్ల (108శాతం) రుణాలను పంపిణీ చేయడంతో పాటు రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆర్థిక భరోసాకు ప్రోత్సాహం..

ఇప్పటి వరకు 618 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.38.85 కోట్ల రుణాలకు బ్యాంకు లింకేజీ కింద అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివ రావు పేర్కొన్నారు. ఇది వరకు ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉప ఉత్పత్తుల తయారీలో భాగంగా భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. మరో వైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా.. దాదాపుగా మూడేళ్ల వడ్డీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని, వడ్డీలేని రుణ పథకాన్ని చేపడతామన్న కొత్త ప్రభుత్వం ప్రకటన అమలుతో మహిళా సంఘాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రోత్సాహకరంగా ఉండనున్నట్లు డీఆర్‌డీఏ పేర్కొంటోంది.

మండలాల వారీగా రుణాల పంపిణీ ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల పరిధిలోని 618 మహిళా సంఘాలకు ఇప్పటి వరకు రూ. 38.85 కోట్ల పంపిణీ చేయగా.. మండలాల వారీగా రుణాల పంపిణీ ఈ విధంగా ఉంది.

◆ ఘట్‌కేసర్ మండలంలోని 133 మహిళా సంఘాలకు రూ.10.64 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయగా.. కీసర మండలంలోని 101 మహిళా సంఘాలకు రూ.5.88 కోట్లు, మేడ్చల్ మండలంలోని 184 సంఘాలకు రూ.11.11 కోట్లు, ఎంసీపల్లి మండలంలోని 96 సంఘాలకు రూ.4.54 కోట్లు, శామీర్‌పేట మండల పరిధిలోని 104 స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ.6.68 కోట్ల రుణాలను అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసరకు చెందిన గుర్రం లక్ష్మారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1.30 లక్షల చెక్కును శనివారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అందజేశారు. అర్హులైన నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోల కృష్ణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, నాయకులు జంగయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, అభిలాష్, కృష్ణారెడ్డి, రాజుయాదవ్, ప్రవీణ్ ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, మల్లేష్‌యాదవ్, దయానంద్‌గౌడ్, కృష్ణ, శ్రీశైలంయాదవ్, అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవంలో జూబ్లిహిల్స్ స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మి

కీసర: విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో భావి భారత పౌరులుగా ఎదగాలని ఏకాగ్రత, చిత్తశుద్ధితో కృషిచేస్తూ లక్ష్యాలను సాధించాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్స్ డైరెక్టర్ వరలక్ష్మి అన్నారు. శనివారం రాంపల్లిదాయరలోని జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. నాయకత్వం బాధ్యతతో కూడిందని, నాయకులు ఎల్లప్పుడూ త్రికరణ శుద్ధిగా పని చేస్తూ క్రమ శిక్షణను పాటించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంతోష్ , మహిళ కన్వీనర్ లలిత

జవహర్‌నగర్: 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో 4న చేపట్టబోయే 72 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా శనివారం యాప్రాల్‌లో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు సంతోష్‌ముదిరాజ్, మహిళ కన్వీనర్ మేక లలిత యాదవ్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనన్నారు. ప్రతి ఒక్కరూ దీక్షకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శశిధర్, సురేందర్, శోభాగౌడ్, రజిత, నవీన్‌యాదవ్, సంధ్యారెడ్డి, రమ, మంజుల, వీణ, మాధవి, పద్మ, హంసవేణి, శ్రీధర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండీ క్రాఫ్ట్స్ శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పొందిన మహిళలతో మాజీ చైర్‌పర్సన్ పావనీ

ఘట్‌కేసర్: పట్టణంలోని కమ్యూనిటీహాల్‌లో గురు శిష్య హస్తశిల్పి ప్రషాసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. క్యాంపులో మహిళలకు కుట్టు, ఎంబ్రాయిడరింగ్, పర్సుల తయారీపై ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య హాజరై మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. చేతి వృత్తుల శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి ఏర్పచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. జంగయ్య, మల్లేష్, రఫీక్, సత్తిరెడ్డి, నిర్వాహకులు సువార్చలా, చంచల్‌పాల్, సుహిత, పరిమళ, ప్రణయ్ పాల్గొన్నారు.

నైపుణ్యంతో అవరోధాలను ఎదుర్కోవాలి



డిగ్రీ ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి

పోచారం: ఇంజినీరింగ్ పట్టభద్రులు భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి అవరోధాలనైనా చాకచక్యంగా నైపుణ్యాలతో ఎదుర్కోవాలని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (టీజేఎన్‌టీయూహెచ్) వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నారపల్లిలోని నల్లమల్లా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్‌డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని 2021–25 మధ్య కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంపిక చేసుకున్న రంగంలో రాణించేందుకు అనుగుణంగా తమను తాము మలచుకోవాలని సూచించారు. టెక్నికల్ స్కిల్స్‌తో పాటు ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. పరిస్థితులకు భయపడకుండా పరిశ్రమించే వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన ×ఐడియా ల్యాబ్‌¥ను లాంఛనంగా ప్రారంభించారు. కళాశాల చైర్మన్ సంధ్యావళి కేతిరెడ్డి, సెక్రటరీ నల్ల మల్లారెడ్డి, డైరెక్టర్ డా. దివ్య నల్ల, కోశాధికారి స్నేహ, ప్రిన్సిపాల్ డా.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, హెచ్‌ఓడీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పోచారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లో నివాసం ఉంటున్న చేర్యాల రవి (45) స్కూటీపై శుక్రవారం జనగాం వెళ్తుండగా.. అన్నోజిగూడలోని డీమార్టు సమీపంలో వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్‌ను శ్రీనివాస్‌గా గుర్తించారు. స్థానికుల సాయంతో పోలీసులు చికిత్స నిమిత్తం బాధితుడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న రవి శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

కీసర: మఠంబావి వద్ద ఉన్న శివాలయంలో దుండగులు చొరబడి దొంగతనానికి పాల్పడిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోగారం మఠంబావి వద్ద ఉన్న శివాలయంలో శనివారం కమిటీ సభ్యులు తలుపులు తీసి చూడగా.. ఆలయంలో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సుమారు రూ.1 లక్ష విలువైన వెండి నాగపడిగె తొడుగు, శివపార్వతుల విగ్రహాలు, ఆభరణాలు, పలు సామగ్రి చోరీ అయినట్లు వివరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

శ్రావణ బోనాలకు ఆలయం ముస్తాబు



విద్యుత్ కాంతులలో అమ్మవారి ఆలయం



గడిమైసమ్మ అమ్మవారు

మేడ్చల్: శ్రావణమాసంలో తొలి ఆదివారం నిర్వహించే గడిమైసమ్మ బోనాలకు గడిమైసమ్మ ఆలయం ముస్తాబైంది. ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే ఈ బోనాల పండగకు మేడ్చల్ గడి మైసమ్మ ఆలయం, మేడ్చల్ పట్టణం సర్వాంగ సుందరంగా విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంది.

సీఎంఆర్‌లో 'థింక్ ఫెస్ట్ 2.0'



ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సీఎంఆర్ థింక్ ఫెస్ట్ 2.0 నిర్వహించారు. దేశంలోని 10 రాష్ట్రాల నుంచి సుమారు 650 జట్లు తమ ప్రాజెక్టులతో నమోదు చేసుకోగా.. నాణ్యత ప్రమాణాల ఆధారంగా 105 జట్లలో 450 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఈవెంట్‌లో విద్య, పరిశ్రమ రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు జ్యూరీగా వ్యవహరించారు. ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచిన జట్లకు సీఎంఆర్ కాలేజ్ సంస్థ చైర్మన్ గోపాల్ రెడ్డి బహుమతులు అందజేశారు. సీఈఓ అభినవరెడ్డి, డైరెక్టర్ నారాయణ ప్రిన్సిపాల్ శేషు, విభాగాధిపతి సురేష్‌రామ్, అధ్యాపకులు తదితర విభాగాల శాఖ అధిపతులు, ప్రభుత్వ పాఠశాలలు,ప్రైవేట్ సంస్థలు, ఇంటర్మీడియట్, డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

గంగపుత్ర ఆత్మ గౌరవ భవనాన్ని త్వరలో పూర్తి చేస్తాం



ఉప్పల్ భగాయత్‌లో సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే మూఠా గోపాల్

ఉప్పల్: ఉప్పల్‌లో గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణం సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్ చైర్మన్, ముషీరాబాద్ ఎమ్మెల్యే మూఠా గోపాల్ అన్నారు. శనివారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మిస్తున్న గంగపుత్ర ఆత్మగౌరవ భవనాన్ని ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ హ యాంలో కుల సంఘాలకు ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం కోకాపేట్, ఉప్పల్‌లో స్థలాలు కేటాయింపుతో పాటు నిధులు కూడా వెచ్చించిందని గుర్తు చేశారు. అదే సమయంలో ఉప్పల్‌లో కూడా గంగపుత్రుల ఆత్మగౌరవ భవనానికి మూడెకరాల స్థలం, రూ. 3 కోట్లను కేటాయించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణాన్ని అడ్డుకోవడం లాంటివి చేయొద్దని హితవు పలికారు. హనుమంత్, రామచందర్, మల్లేష్, సుదర్శన్, ప్రసాద్, గోరఖ్‌నాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంకుషాపూర్‌లో బోనాలతో మహిళలు

ఘనంగా పెద్దమ్మ బోనాలు

ఘట్‌కేసర్: అంకుషాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను అందంగా అలంకరించి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి దేవాలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రమాదాలపై నిర్లక్ష్యం వీడేనా ?

- రోడ్డుపై ఇష్టానుసారంగా పార్కింగ్
- తగిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు



అవుషాపూర్ వద్ద సర్వీస్ రోడ్డుపై నిలిపిన లారీలు

ఘట్‌కేసర్: వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు ఇష్టానుసారంగా పార్క్ చేసే భారీ వాహనాల కారణంగా ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కన లారీలు, డీసీఎంలు, డీజిల్ ట్యాంకర్లను అడ్డగోలుగా నిలుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై నిలిపే వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో వాటిని ఢీకొని ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

ప్రమాదంలో ప్రయాణం...

జాతీయ రహదారుల అధికారులు, పోలీస్‌శాఖ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో యదేచ్ఛగా రోడ్డు పక్కన నిలుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రోడ్డుపై నిలిపిన వాహనాలతో ప్రమాదం జరిగి అమాయకులు మృత్యువాతపడుతున్నారు.

భారీ వాహనాల అనుమతికి పరిమితులు

నగరంలోకి భారీ వాహనాలు ఎప్పుడంటే అప్పుడు ప్రవేశించడానికి అనుమతి ఉండదు. ఆయా వాహనాలను పరిమిత సమయాల్లో మాత్రమే అనుమతిస్తారు. ఇలా రోడ్డుపై ఆపిన వాహనాలను ఢీ కొట్టిన ఘటనలో ఇప్పటికే పలువురు మృతి చెందారు.

– ఘట్‌కేసర్ బైపాస్ చౌరస్తా సర్వీస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అవుషాపూర్ హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఓ విద్యార్థి ఓ చేతిని కోల్పోయాడు.

◆ మహబూబాబాద్‌కు చెందిన అహ్మద్(35) బొలెరో వాహనంలో పాత బ్యాటరీలు హైదరాబాద్‌కు తీసుకొస్తుండగా అవుషాపూర్ హెచ్‌పీసీఎల్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పార్కింగ్‌కు స్థలం ఎక్కడా.. ?

పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం లేకపోవడంతోనే రోడ్డు పక్కన వాహనాలు నిలుపుతామని డ్రైవర్లు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



రోడ్డు పక్కన నిలిపిన వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆగి ఉన్న వాహనాలు దగ్గరికి వచ్చేంత వరకు కనిపించడం లేదు. దీంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. రోడ్డు పక్కన వాహనాలు నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జంగయ్యముదిరాజ్, అవుషాపూర్

పార్కింగ్ లేకే ప్రమాదాలు



వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం లేకపోవడంతోనే రోడ్డు పక్కన వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ప్రయాణాలతో పాటు స్థానికులకు సమస్యలు ఎదురౌతున్నాయి. రోడ్డు పక్కన వాహనాలు ఆపకుండా పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలి.

– మల్లేష్ ముదిరాజ్, ఏదులాబాద్